కేటీఆర్‌పై పోలీసులకు ఫిర్యాదు



బహదూర్‌పురా కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ పులిపాటి రాజేష్‌కుమార్

బహదూర్‌పురా : బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కాంగ్రెస్‌పై 27 పేజీల పుస్తకాన్ని విడుదల చేయడంపై బహదూర్‌పురా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పులిపాటి రాజేష్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక నేతలతో కలిసి కామాటిపురా పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ముఖ్యపాత్ర పోషించిన కాంగ్రెస్‌ను 420 అని సంబోధించడం, కాంగ్రెస్ పార్టీ అధికారిక చిహ్నం అయిన చేయి గుర్తుపై 420 అని ముద్రించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు'. కేటీఆర్‌పై కేసు నమోదు చేయాలని ఆయన పోలీసులను కోరారు. కాంగ్రెస్ నాయకులు సయ్యద్‌షా ముజాహీద్, ఇక్బాల్, అబేద్‌అలీ, నజీర్‌ఖాన్, జుబేర్, హరిబాబు, సుమంత్, కృష్ణ తదితరులున్నారు.

అహ్మద్‌నగర్‌లో టెన్షన్ టెన్షన్

- ప్రజాపాలన ప్రచారంలో గందరగోళం
- కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు బస్తీమే సవాల్
- పోలీసుల రంగప్రవేశంతో సద్దుమణిగిన గొడవ



ప్రచారాన్ని విరమించుకోవాలని సర్ది చెబుతున్న పోలీసులు



అహ్మద్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మహ్మద్ ఫిరోజ్‌ఖాన్

నాంపల్లి : ప్రజాపాలన కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ అహ్మద్‌నగర్ డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు చాచా నెహ్రూపార్కు వద్ద ప్రారంభమైన ఈ పాదయాత్ర సాయంత్రం 4.30 గంటల వరకు బస్తీల్లో కొనసాగింది. డివిజన్‌లోని గల్లీలలో మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ పర్యటించారు. కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్ పాదయాత్రకు వస్తున్నారన్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అక్కడికి చేరుకున్నారు. దీంతో ఇరు పార్టీలకు చెందిన నేతలు బస్తీల్లో ప్రత్యక్షం కావడంతో అహ్మద్‌నగర్‌లో టెన్షన్ వాతావరణం నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే, ఏఐఎంఐఎం నేత మాజిద్ హుస్సేన్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ ఒకరికొకరు తారసపడ్డారు. ఎవరికి వారు బస్తీమే సవాల్.. అంటూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

తెలుగులో మాట్లాడంపై..

ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ తెలుగులో మాట్లాడుతూ.. ప్రజలను పలుకరించడంపై స్థానికంగా ఆసక్తికర చర్చ జరిగింది. డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో ఇరువురు నేతలు నువ్వా.. నేనా.. అంటూ తలబడిన విషయం తెలిసిందే. అతి తక్కువ ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ ఈ ఎన్నికల్లో ఓటమిని చవి చూశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా అధికారంలోకి రాగా.. బీఆర్‌ఎస్ అధికారానికి దూరమైంది.

ఇరు పార్టీల నేతలతో పోలీసులకు సవాల్..

బస్తీల్లో ఇరు పార్టీల నేతలు ప్రచారానికి దిగడంతో పోలీసులకు కష్టంగా మారింది. కాంగ్రెస్, ఎంఐఎం నేతలు దాడులు చేసుకుంటారేమోనని భయంతో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రచారానికి పోలీసుల అనుమతి లేని స్థానిక ఎమ్మెల్యేను పోలీసులు అడ్డుకుని అక్కడి నుంచి పంపించి వేశారు. దీంతో పరిస్థితి అదుపులోకి రావడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

బీఆర్‌ఎస్‌తో కలిసి నడిచిన, స్వల్ప మెజార్టీతో నాంపల్లి నియోజకవర్గంలో గెలుపొందిన ఏఐఎంఐఎంకు ఇది పరీక్షా కాలంగా మారిందని వినికిడి.

రెండు నెలల్లో పార్లమెంట్ ఎలక్షన్స్..

మరో రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు ఉండటం, ఈ ఎన్నికలే ఆయా పార్టీలకు సవాల్‌గా నిలిచాయి. గెలుపును చేజార్చుకున్న కాంగ్రెస్ పార్టీ, సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానంలో గెలిచిన ఏకైక స్థానం కోసం మజ్లిస్ పార్టీలు ఇప్పటి నుంచే ఇరు పార్టీల నేతలు ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తున్నారు. ఇదే లక్ష్యంతో ఆయా పార్టీలకు చెందిన నేతలు ఇప్పటి నుంచే బస్తీల్లో కలియతిరుగుతూ.. ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

గోల్కొండ: ఈనెల 6న మాసబ్‌ట్యాంక్‌లోని ఖాజామెన్షన్ ఫంక్షన్‌హాల్‌లో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ తెలిపారు. మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని పదోతరగతి నుంచి డిప్లొమా, ఇంజినీరింగ్ పూర్తిచేసిన వారు ఈ జాబ్‌మేళాలో రావాలని సూచించారు. 13 వేల ఉద్యోగాల భర్తీ ఈ జాబ్‌మేళా ద్వారా జరుగుతుందని, వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి సెలెక్ట్ అయిన వారికి నియామక ఉత్తర్వులు అందజేస్తారని ఆయన తెలిపారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం



హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసిన సుభాష్, సత్యం తదితరులు

అబిడ్స్ : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో ప్రజలకు అమలు చేసి తీరుతామని జాంబాగ్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.సుభాష్ వెల్లడించారు. దారుసలాం, హిందీనగర్ ప్రాంతాల్లో ప్రజాపాలనలో ఆయన హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు దరఖాస్తు ఫారాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు పక్కా అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను ఆరు గ్యారంటీలను అంచెలంచెలుగా అమలు చేస్తున్నామన్నారు. గోషామహల్ కాంగ్రెస్ నాయకులు క్వాదీర్, సత్యంగౌడ్, రాగిణి, క్వార్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓల సమస్యలను పరిష్కరించండి



మంత్రి పొంగులేటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీష్

అబిడ్స్ : వీఆర్‌ఓల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ గోల్కొండ సతీష్ పేర్కొన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని అడిషనల్ సెక్రటరీ జనరల్ పల్లెపాటి నరేష్‌తో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి వీఆర్‌ఓల సమస్యలను వివరించారు. అనంతరం గోల్కొండ సతీష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో గ్రామ రెవెన్యూ వ్యవస్థ ద్వారా రద్దయిన వీఆర్‌ఓలను తిరిగి రెవెన్యూశాఖలో తీసుకొచ్చి గ్రామ పరిపాలన ద్వారా సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వానికి వీఆర్‌ఓలు అండగా ఉండి అన్ని ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ అభివృద్ధి పథకాలను అందించేందుకు ముందుంటామన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం వేగంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, వీఆర్‌ఓల జేఏసీ నాయకులు పల్లెపాటి నరేష్, చింత మురళి, ప్రతిభ, శ్రీహరినాయక్, శేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వచన కవిత అధ్యయన శిబిరం

సుల్తాన్‌బజార్ : తెలంగాణ సారస్వత పరిషత్తు ఇటీవల నిర్వహించిన యువ రచయిత్రుల సమ్మేళనానికి కొనసాగింపుగా ఫిబ్రవరి 11న యువ కవయిత్రులకు వచన కవిత్వంలో అధ్యయన శిబిరం నిర్వహించాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లో అబిడ్స్ తిలక్ రోడ్డులోని పరిషత్ ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు సాగే ఈ శిబిరంలో కవిత్వ భాషాశైలి, శీర్షిక, వస్తువు, శిల్పం, ఎత్తుగడ, నిర్వహణ, ముగింపు మొదలైన అంశాలపై ప్రముఖ కవులు, విమర్శకులు శిక్షణను ఇస్తారు. యువ రచయిత్రుల సమ్మేళనంలో పాల్గొన్న కవయిత్రుల్లో సుమారు 50 మందిని వారి కవితల ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఇటీవల రాసిన స్వీయ కవితను, ఇతర వివరాలతో దరఖాస్తు పంపితే ఎంపిక చేస్తామని పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య ప్రకటించారు. 96037 27234 వాట్సాప్ నంబరుకు తమ కవితలను ఈనెల 12 లోగా పంపాలని స్పష్టం చేశారు.

గోషామహల్‌లో అక్షింతల పంపిణీ



అక్షింతలను పంపిణీ చేసిన గోపాల్‌జీ

అబిడ్స్: ఈనెల 22న అయోధ్య సంబరాలు పెద్దఎత్తున చేపడుతామని రాష్ట్ర బీజేపీ కార్యాలయం కో- ఆర్డినేటర్ గోపాల్‌జీ పేర్కొన్నారు. అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షింతలు గోషామహల్‌లోని పలు ప్రాంతాలు ఇంటింటా పంపిణీ చేశారు. అనంతరం గోపాల్‌జీ మాట్లాడుతూ.. ఈనెల 22న అయోధ్య ఆలయ ప్రారంభోత్సవం రోజున దీపావళిని తలపించేలా సంబరాలు చేస్తామని ప్రకటించారు. దీపాలు వెలిగించి దీపావళి శోభను తీసుకొస్తామన్నారు. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం ఈ ఏడాదిలోనే పెద్ద పండుగ అని గోపాల్‌జీ అన్నారు. గోషామహల్ నియోజకవర్గంలోని ఇంటింటా రాములవారి అక్షింతలు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక శివగంగానగర్ శివాలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర అక్షింతల వితరణ గురువారం స్థానిక బస్తీలలో కొనసాగింది. బీజేపీ నాయకులు మహేందర్ పాల్గొని స్థానిక ప్రజలకు భవ్య రామమందిరం విశిష్టతను వివరించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజలింగం, దశరథ్, రామరాజు, శ్రీనివాస్, మహేష్ యాదవ్, విజయ్‌కుమార్, మహేందర్, జగదీష్, రామకృష్ణ తదితరులున్నారు.

బొడ్రాయి ఆవిష్కరణకు కేంద్రమంత్రికి ఆహ్వానం



ఆహ్వానపత్రాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ తదితర విషయాల్లో తాను అన్ని రకాలుగా ఆలయ నిర్వాహకులకు సహకారం అందిస్తానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ హనుమాన్ ఆలయం వద్ద పునర్నిర్మించిన బొడ్రాయి ఆవిష్కరణ కార్యక్రమానికి రావాలని కోరుతూ ఆలయ ప్రతినిధులు గురువారం ఆయనను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. సందేష్‌యాదవ్, రాధాకృష్ణయాదవ్, దేవర వంశీ, ప్రవీణ్, అరవింద్, శ్రీకాంత్‌సాగర్ తదితరులున్నారు.

ఉప్పుగూడ బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా బాలరాజు



చాంద్రాయణగుట్ట: బీఆర్‌ఎస్ పార్టీ ఉప్పుగూడ డివిజన్ అధ్యక్షుడిగా బొడిగల బాలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జ్ ముప్పిడి సీతారాంరెడ్డి గురువారం ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ.. ఉద్యమ కాలం నుంచి పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతూ.. వచ్చిన తనకు డివిజన్ అధ్యక్ష పదవి అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీ పటిష్టత కోసం పాటు పడతానని తెలిపారు. పార్టీ నాయకులు గండూరు రామచంద్రం, దర్శన్, పెద్దయ్య, పృథ్వీరాజ్, సంజయ్, చింటు తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో సందర్శకులకు తగిన ఏర్పాట్లు



అబిడ్స్ : ఎగ్జిబిషన్‌లో సందర్శకుల సౌకర్యార్థం పలు రకాల ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ పబ్లిసిటీ సబ్ కమిటీ కన్వీనర్ జీవీ.రంగారెడ్డి పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు వచ్చే సందర్శకులు, సందర్శకుల పిల్లలెవరైనా తప్పిపోతే వారికి రేడియో అనౌన్స్‌మెంట్ ద్వారా ప్రకటనలు చేస్తామన్నారు. గురువారం పబ్లిసిటీ సబ్‌కమిటీ కార్యాలయంలో జీవీ.రంగారెడ్డి మాట్లాడుతూ.. 80 స్పీకర్ల ద్వారా రేడియో అనౌన్స్‌మెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. తమ సబ్ కమిటీ కార్యాలయంలో ఒక మేయిన్ కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. తమ కంట్రోల్‌రూమ్‌కు ఎగ్జిబిషన్ వాలంటీర్లు, సెక్యూరిటీలు తప్పిపోయిన వారిని తీసుకొస్తారన్నారు. రేడియో అనౌన్స్‌మెంట్ ద్వారా వారి కుటుంబ సభ్యులను అలర్ట్ చేసి సంబంధీకులకు అప్పజెప్తామన్నారు. స్టాల్స్ యజమానులు ఎవరికైనా అవసరం ఉంటే రేడియో అనౌన్స్‌మెంట్ ద్వారా వాయిస్ ఆఫ్ ఎగ్జిబిషన్ ద్వారా ప్రచారం చేస్తున్నామన్నారు. స్టాళ్లవారి ప్రకటనలు, వారి వివరాలను వాయిస్ ఆఫ్ ఎగ్జిబిషన్ తరహాలో రేడియో అనౌన్స్‌మెంట్ నిర్వహించి స్టాల్స్‌కు ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. సభ్యులు రవికుమార్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు



గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో పేదలకు ఎంతో మేలు చేకూరిందని ఆ పార్టీ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు ఉస్మాన్‌బిన్ మహ్మద్ అల్‌హాజిరి అన్నారు. గురువారం ఆయన సమక్షంలో అంద్రూన్ కార్వాన్‌లో స్థానిక యువకులతో పాటు వివిధ పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పేద ప్రజల నాడి తెలిసిన నాయకుడని అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలియమైన శక్తిగా రూపుదిద్దుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అభయహస్తం దరఖాస్తు పూర్తి చేసుకున్న వారు అధికారులు ఇచ్చిన రసీదును జాగ్రత్తగా ఉంచుకోవాలని, అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. జగన్‌గౌడ్, ప్రవీణ్‌చారి, అనిల్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానం



గన్‌ఫౌండ్రీ : మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని నేటి యువత ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ల రామకృష్ణ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో సావిత్రీబాయిపూలే ఫౌండేషన్, ఎంబీసీ, డీఎస్‌టీ సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులను ప్రదానం చేశారు. కిరణ్‌గౌడ్ రచించిన 'సావిత్రీబాయి పూలే ఆధునికత, సాధికారతల సమన్వత శిఖరం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

టేబుల్ కేలండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ తదితరులు

సుల్తాన్‌బజార్ : కేలండర్లు భవిష్యత్తు రూపకల్పనకు ఎంతో దోహదం చేస్తాయని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో 2024 కేలండర్‌ను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎన్.నరేందర్‌రావు మాట్లాడుతూ... ప్రతి ఏటా తమ యూనియన్ హైదరాబాద్ జిల్లా టేబుల్ కేలండర్‌ను ఆవిష్కరిస్తామన్నారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా కలెక్టర్ చేతులమీదుగా కేలండర్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాత సీపీఎస్‌ను పునరుద్ధరించాలని ఆయన కోరారు. సీపీఎస్‌కు వ్యతిరేకంగా గత ఎన్నో ఏళ్లుగా పోరాటం జరుగుతున్నా.. గత ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఆయన కోరారు. సంఘం ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్, అసోసియేట్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్, నాయకులు ఆనంద్, సురేష్, బాల్‌రాజ్, సుదర్శన్, ప్రసాద్, ఏసుపాదం, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

హాకర్లను వేధించొద్దు



హాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సెవన్ టూమ్స్ చౌరస్తా వద్ద ఆర్మీ అధికారులు హాకర్లను అకారణంగా వేధిస్తున్నారని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ ఆరోపించారు. గురువారం ఆయనను టూమ్ చౌరస్తా వద్ద వారిని కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా హాకర్లు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. సెవన్ టూమ్స్ ఎదురుగా ఉన్న రక్షణశాఖ స్థలంలో విధులు నిర్వహించే సైనికులు తమ కూరగాయలు, ఇతర వస్తువులను రోడ్డుపై పారవేస్తూ.. నానా రకాలుగా వేధిస్తున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ఓ వైపు ట్రాఫిక్ అధికారులు, మరోవైపు ఆర్మీ వేధింపులతో తమకు పూట గడవడం కష్టంగా మారిందన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. ఆర్టిలరీ సెంటర్‌లో కమాండెంట్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చినట్టు సమాచారం. టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్‌ఫరాన్, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

రవికుమార్‌కు డాక్టరేట్



గన్‌ఫౌండ్రీ : ఏసీఈ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ రవికుమార్‌కు జేఎన్‌టీయూ గౌరవ డాక్టరేట్‌కు ఎంపికయ్యాడు. ప్రొఫెసర్ పూర్ణచందర్ రావు పర్యవేక్షణలో సీక్వెన్షియల్ ప్యాటర్నర్ మైనింగ్ ఓవర్ లార్జ్ డాటాసెట్స్ విత్ ఆప్టిమల్ ప్రేమ్‌వర్క్ అనే అంశంపై చేసిన పరిశోధనలకు ఆయనకు డాక్టరేట్ రావడంపై గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు చేసి విద్యార్థులకు ఉపయోగపడేలా అంకితభావంతో కృషి చేస్తానని పేర్కొన్నారు.

టీసీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజ్‌నారాయణ్



చార్మినార్: తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ (టీసీసీ) రాష్ట్ర అధ్యక్షులుగా ప్రముఖ సంఘసేవకులు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం నగరంలోని టీసీసీ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత నాలుగు దశాబ్దాలుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పని చేస్తున్న ఆయన ఇప్పటికే తెలంగాణ మేధావుల ఫోరం గౌరవ అధ్యక్షులుగా, జాతీయ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా,రాష్ట్ర హైకోర్టు లోక్ అదాలత్ సభ్యులుగా కొనసాగుతున్నారు.

గోడౌన్‌లో యువకుడిని బంధించి..

- గుర్తు తెలియని యువకుల దాడి
- రూ.20 వేలు లాక్కున్న వైనం

గౌలిపురా: గుర్తు తెలియని వ్యక్తులు ఓ యువకుడి గోడౌన్‌లో బంధించి, అతడిపై దాడి చేసి రూ.20 వేలు లాక్కున్న సంఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవీందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జుమ్మెరాత్‌బజార్ ప్రాంతానికి చెందిన శివసింగ్ ఓలా క్యాబ్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈ నెల 3న రాత్రి అతడికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి హుక్కా తాగేందుకు తలాబ్ కట్టా రోడ్డు నంబర్–11 తవాక్కల్ పాన్ షాపు వద్దకు రావాలని కోరాడు. అక్కడికి చేరుకున్న శివసింగ్‌ను మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి గోడౌన్‌లో బంధించి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బులు లేవని చెప్పగా వారు బలవంతంగా శివసింగ్ ఫోన్‌ను లాక్కుని గూగుల్ పే ద్వారా రూ.20 వేలు బదిలీ చేసుకున్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామంటూ బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు భవానీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చార్మినార్‌లో కనీస సౌకర్యాలు కరువు

- పర్యాటకులకు అందుబాటులో లేని తాగునీరు, క్లాక్‌రూమ్స్
- పనిచేయని సీసీ కెమెరాలు



చార్మినార్ కట్టడం



సందర్శకుల సందడి

చార్మినార్: చార్మినార్ చూసేందుకు వచ్చిన సందర్శకులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో పర్యాటకులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. వారికి తాగునీటితో పాటు బ్యాగులు ఇతర వస్తువులను భద్రపరుచుకునేందుకు క్లాక్‌రూంలు అందుబాటులో లేవు. భద్రతాచర్యల దృష్ట్యా చార్మినార్ కట్టడంలోని బ్యాగ్‌లతో పాటు ఇతర వస్తువులను అనుమతించరు. దీంతో తమ వెంట తెచ్చుకున్న బ్యాగులు, ఇతర వస్తువులను భద్రపరుచుకునేందుకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులకు గురవుతున్నారు.

- రోజూ సందర్శకుల ద్వారా వస్తున్న ఆదాయం రోజురోజుకు పెరుగుతున్నా.. సందర్శకులకు ఆశించిన స్థాయిలో సౌకర్యాలు లభించడం లేదనే విమర్శలున్నాయి.
- వీకెండ్‌లలో పర్యాటకుల సంఖ్య రోజుకు 5 వేల నుంచి 6 వేలకు పైగా ఉంటుండటంతో వారి ద్వారా ఏఎస్‌ఐకు దాదాపు రెండు లక్షల వరకు ఆదాయం ఉంటుందని అంచనా. రోజుకు లక్షల్లో ఆదాయం వస్తున్నా.. కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదని ప్రశ్నిస్తున్నారు.

ఆదాయంపై ఉన్న శ్రద్ధ...

దేశ విదేశాల నుంచి చార్మినార్ కట్టడాన్ని సందర్శించే పర్యాటకుల సౌకర్యార్థం అవసరమైన చర్యలు చేపట్టడానికి పురాతత్వశాఖ (ఏఎస్‌ఐ– ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా) అధికారులు ఆసక్తి చూపడం లేదని సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదాయంపై చూపిస్తున్న శ్రద్ధ సౌకర్యాల ఏర్పాటులో లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మినార్‌ల కెమికల్ ట్రీట్‌మెంట్ పనులు..

మినార్‌లకు కేవలం కెమికల్ ట్రీట్‌మెంట్ పనులు మాత్రమే చేపడుతున్నారని సందర్శకులకు అవసరమైన సౌకర్యాల పట్ల ఏమాత్రం దృష్టి సారించడం లేదని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చార్మినార్ కట్టడంలో సందర్శకులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా అందుబాటులో లేదు. కట్టడంలో ఏర్పాటు చేసిన ఏ ఒక్క సీసీ కెమెరా పనిచేయడం లేదని పలువురు వాపోతున్నారు.

రిమోట్ ప్రెసెన్స్ కియోస్కీని ఏర్పాటు చేయాలి..

చార్మినార్ కట్టడంలో గతంలో ఏర్పాటు చేసిన రిమోట్ ప్రెసెన్స్ కియోస్కీ ప్రస్తుతం కనుమరుగైంది. మక్కా మసీదు, ఉస్మానియా ఆసుపత్రి, హైకోర్టు, యునాని, ఫలక్‌నుమా ప్యాలెస్, గోల్కొండ, చౌమహల్లా ప్యాలెస్ తదితర పురాతన కట్టడాలను దగ్గరగా కనులారా తిలకించేందుకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 2002 జూన్ 8న చార్మినార్ కట్టడంలోని ఒక చోట చార్మినార్ రిమోట్ ప్రెసెన్స్ క్రియోస్కిని ఏర్పాటు చేశారు.

రూ.28 లక్షల వ్యయంతో..


దాదాపు రూ. 28 లక్షల రూపాయల వ్యయంతో పురాతన కట్టడాలను దూరంగా ఉన్నవాటిని దగ్గరగా చూసేందుకు చార్మినార్ కట్టడంలో రిమోట్ ప్రెసెన్స్ క్రియోస్కిని ఏర్పాటు చేశారు. దీని కోసం చార్మినార్ పైభాగంలో నాలుగు కెమెరాలను అమర్చారు. కొన్నేళ్ల పాటు రెండు కెమెరాలు పనిచేయకుండా పోయాయి. మిగిలిన రెండు కెమెరాల ద్వారా సందర్శకులు చార్మినార్, మక్కామసీద్, ఫలక్‌నుమా ప్యాలెస్‌లను తిలకిస్తున్నారు. ప్రస్తుతం అవి కూడా పనిచేయడం లేదని సమాచారం. టచ్ స్క్రీన్ ఆనవాళ్లు కూడా చార్మినార్ కట్టడంలో కనిపించకుండా పోయాయి. పనిచేయని రిమోట్ ప్రెసెన్స్ కియోస్కీ టచ్‌స్క్రీన్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.



2002లో ఏర్పాటు చేసిన టచ్‌స్క్రీన్

పోలీసులకు బీజేపీ నేతల సత్కారం

– గ్రాండ్ హోటల్ దాడిలో నిందితుల అరెస్ట్‌పై హర్షం



అబిడ్స్: అబిడ్స్ పోలీసులు వేగంగా స్పందించి పోలీస్‌శాఖపై మరింత నమ్మకం కల్పించారని రాష్ట్ర బీజేపీ దళితమోర్చా ఉపాధ్యక్షులు భీశ్వ ఓంప్రకాష్ పేర్కొన్నారు. అబిడ్స్ గ్రాండ్ హోటల్‌లో ధూల్‌పేట వాసులపై దాడిచేసిన గ్రాండ్ హోటల్ వెయిటర్స్‌ను వెంటనే అరెస్టు చేసి ఘర్షణ చెలరేగకుండా చాకచక్యంగా పోలీసులు విధులు నిర్వహించారన్నారు. పోలీసులు వేగంగా స్పందించారని గురువారం అబిడ్స్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు, సెక్టార్ ఎస్సై మహేందర్‌లను బీజేపీ సీనియర్ నాయకులతో కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం భీశ్వ ఓంప్రకాష్ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఆధారంగా వెయిటర్స్ దాడిచేసి పరారు కావడంతో వారిని అరెస్ట్ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. పోలీసులు ఇలాంటి ఘర్షణ కేసుల్లో వేగంగా స్పందించడం ద్వారా వివాదాలు, ఘర్షణలు కొద్దిసేపట్లోనే సద్దుమనుగుతాయన్నారు. పోలీసుల స్పందించే తీరుతోనే ప్రజాసమస్యలు వేగంగా పరిష్కారం అవుతాయన్నారు. అబిడ్స్ పోలీసులు గ్రాండ్‌హోటల్ ఘటనలో స్పందించిన తీరు సంతృప్తిగా ఉందని భీశ్వ ఓంప్రకాష్ పేర్కొన్నారు. బీజేపీ నాయకులు అనిల్, రామ్‌బాబు పాల్గొన్నారు.

నిరుపేదలకు బాసటగా సంక్షేమ పథకాలు



దరఖాస్తు పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు కిషన్ గజిరే

జియాగూడ : సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన సంక్షేమ పథకాలు నిరుపేదలకు బాసటగా నిలుస్తాయని కాంగ్రెస్ పార్టీ జియాగూడ డివిజన్ ఎస్సీసెల్ అధ్యక్షుడు కిషన్‌గజిరే అన్నారు. గురువారం జియాగూడలో ప్రజాపాలనలో అభయహస్తం పథకం కింద దరఖాస్తులను ఆయన అందజేశారు. శివలాల్‌సింగ్, రామ్‌కుమార్, గోవర్ధన్, సయ్యద్ హబీబ్, వెంకటేష్ తదితరులున్నారు.

సిటీ కాలేజీలో ముగిసిన జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

చార్మినార్: రాజ్యాంగాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తే ఆర్థికాభివృద్ధి గణనీయంగా పెరుగుతుందని ప్రముఖ విద్యావేత్త, రాజనీతి శాస్త్రవేత్త ఆచార్య కోదండరాం అన్నారు. రాజ్యాంగ పరిరక్షణే అందరి ధ్యేయం కావాలన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజీలోని రాజనీతి శాస్త్ర విభాగం, 'కమిషన్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ' సంయుక్తాధ్వర్యంలో రెండ్రోజుల పాటు జరిగిన జాతీయసదస్సు గురువారం ముగిసింది.ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వలస పాలనకు వ్యతిరేకంగా స్వయంపాలన కోసం జరిగిన పోరాటంలో నుంచి రాజ్యాంగ అవసరం ఏర్పడిందన్నారు. రెండ్రోజుల పాటు జరిగిన ఈ సదస్సుకు రాజనీతి శాస్త్ర ఆచార్యులు డాక్టర్ కె.భాస్కర్ సమన్వయ కర్తగా వ్యవహరించారు.

వ్యక్తి అదృశ్యం



మైసయ్య (ఫైల్)

నాంపల్లి : నిలోఫర్ ఆసుపత్రికి వచ్చిన ఓ రోగికి సహాయకుడిగా వ్యక్తి అదృశ్యమయ్యారు. ఈ ఘటన నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లాకు చెందిన రవి, శ్రీలతకు చెందిన 7 నెలల కుమార్తె సహస్ర అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం డిసెంబరు 29న రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో చేర్పించారు. ఈనెల 2న చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందింది. కాగా చికిత్స పొందుతున్న సమయంలో తన మనుమరాలిని చూసేందుకు మైసయ్య (48) ఆసుపత్రికి వచ్చాడు. ఆసుపత్రికి వచ్చిన అతడు కనిపించకుండా పోయాడు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బంధువులు నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సంప్రదించాల్సిన నంబరు. 7013319193.